శిశు పోషణ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శిశు, బాల్య పోషణ కోసం మాస్టర్ ట్రైనర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురు, శుక్రవారం ఈ శిక్షణను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనిసెఫ్ నుంచి మాస్టర్ రిసోర్స్‌పర్సన్ రెసా, గోరి హాజరై అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లకు సమగ్రంగా శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ సుదం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హలో.. బాగున్నారా..!

పట్టణ ప్రాంతాల్లోని గ్రామీణ ఓటర్లకు అభ్యర్థుల ఫోన్లు

- అప్యాయంగా మాట్లాడుతున్న పోటీదారులు
- ఎన్నడూ లేని పలకరింపులతో ఆశ్చర్యపోతున్న ఓటర్లు
- ఉపాధి కోసం ఊరు విడిచి వెళ్లిన పలువురు..
- గ్రామానికి వచ్చి ఓటు వేయాలని విజ్ఞప్తులు
- రవాణా సదుపాయం కల్పిస్తామని హామీలు

> గతంలో ఊరికి వస్తే కనీసం పలకరించని వారు, ఫంక్షన్లకు ఆహ్వానించని వారు పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని ఆప్యాయతలు, బంధుత్వాలు కలుపుకొని ఫోన్లు చేస్తూ హడావిడి చేస్తున్నారు. ఉపాధి కోసం ఊరు విడిచి వెళ్లిన ఓటర్ల వివరాలను ఆరాతీస్తూ ప్రేమ ఒలకబోస్తున్నారు. ఎలాగైనా ఊరికివచ్చి తనకు ఓటు వేసిపోవాలని, రవాణా సదుపాయం కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. గెలుపుకోసం శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎన్నడూలేని ముచ్చట్లతో ఓటర్లు ఇదేంటని ముక్కున వేలేసుకుంటున్నారు.

నిజామాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గెలుపుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్నత చదువుల కోసం, కుటుంబ అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లి అక్కడే ఉంటున్న వారికి అభ్యర్థులు ఫోన్ చేసి పలకరిస్తున్నారు. గ్రామానికి వచ్చి తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో వివిధ పనులు చేసుకుంటున్న వారికి ఇప్పుడు ఏ ఫోన్ చూసినా ఎన్నికల గురించే చర్చ జరుగుతోంది. గతంలో ఎప్పుడు పలకరించనివారు సైతం సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. పోలింగ్ రోజు స్వగ్రామానికి రావాలని అవసరమైన రవాణా ఖర్చులు కూడా తామే భరిస్తామని ఓటర్లకు హామీలు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో సహా వచ్చి తమకు ఓటు వేయాలని అభ్యర్థులు ఫోన్‌లలో వేడుకుంటున్నారు. గ్రామాల్లో ఉన్న ఓటరు జాబితా ప్రకారం పట్టణాల్లో స్థిరపడిన వారిని కలుస్తున్నారు. వీలుకాకపోతే ఫోన్‌ల ద్వారా మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టణాల్లో స్థిరపడ్డ వేలాదిమంది గ్రామీణ ఓటర్లు..

జిల్లా నుంచి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి తదితర ప్రాంతాలతో పాటు గల్ఫ్ దేశాలలో అనేక మంది వలస వెళ్లి అక్కడ జీవనం కొనసాగిస్తున్నారు. జిల్లా నుంచి గల్ఫ్‌లో వేలాదిమంది పనిచేస్తుండగా హైదరాబాద్ తదితర నగరాలలో సైతం జిల్లాకు చెందిన వారు ఎంతో మంది ఉద్యోగాలు చేస్తున్నారు. కొంతమంది రోజువారి వేతనాల కోసం మరికొంత మంది వ్యాపారాల కోసం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయినప్పటికీ వారికి సొంత గ్రామాల్లో ఓటు హక్కు పొంది ఉన్నారు. దీంతో రాబోయే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు సుదూర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్ల కోసం ప్రత్యేకంగా ఫోన్‌లు చేస్తూ మాట్లాడుతున్నారు. గతంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల కోసం అభ్యర్థులు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో ప్రతి ఓటు గెలుపోటములను నిర్ణయించే అవకాశాలు ఉన్నందున ఏ ఓటును కూడా వృథా చేయవద్దనే ఉద్దేశంతో అభ్యర్థులు ఓటు కలిగి ఉన్న వారికి ఫోన్‌లు చేసి ఆప్యాయంగా ప్రేమతో పలకరిస్తున్నారు. ఓటర్ల బ్యాంకు ఖాతాలు లేదా ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్‌లను తీసుకుని వారికి రవాణా ఖర్చులు కూడా అకౌంట్‌లలో వేస్తున్నారు. వచ్చాక విందులు సైతం ఇచ్చేందుకు అభ్యర్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమకే ఓటు

మిగతా 8వ పేజీలో...

ముగిసిన మూడో విడత నామినేషన్లు



- మొదటి విడతలో ప్రచారాల జోరు
- నేటితో ముగియనున్న రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ
- జోరందుకున్న ఎన్నికల ప్రచారం
- గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయం

నిజామాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పల్లె రాజకీయాలు వేడెక్కాయి. మూడు విడతల్లో జిల్లాలోని 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులకు జరగనున్న ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికల ప్రచార జోరు ప్రారంభమైంది. ఈ నెల 3న సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థులు ఖరారు కావడంతో అభ్యర్థులంతా గెలుపుకోసం తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మొదటి విడత పోలింగ్ ఈ నెల 11న ఉండడంతో ప్రచారానికి సమయం ఎక్కువలేకపోవడంతో అభ్యర్థులంతా గెలుపుకోసం తమ ప్రయత్నాలు చేస్తున్నారు. రెండో విడత ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుండడంతో నామినేషన్‌లు వేసిన వారిని బుజ్జగిస్తూ పోటీలో ఉన్న తప్పుకునేలా అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం సాయంత్రం 3 గంటలలోగా నామినేషన్‌లను ఉపసంహరించుకుని సాయంత్రం 5 గంటల తర్వాత పోటీలో ఉండే అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలు ఉండడంతో రెండో విడత ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎక్కువమంది పోటీలో లేకుంటే గెలుపుఖాయమనే ఆలోచనతో ఉన్న అభ్యర్థులు నామినేషన్‌లు వేసిన వారిని

మిగతా 8వ పేజీలో...



ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

బోధన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. తొలి విడతగా బోధన్ డివిజన్‌లోని మండలాలలో ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆర్‌వోలు, సహాయ ఆర్‌ఓలకు బోధన్ పట్టణంలోని లయన్స్ భవన్ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధలపై పూర్తి అవగాహనను ఏర్పచ్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావు లేకుండా నిబంధనలను తుచ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా తగినంత కోరం ఉండా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులలో సూచించిన అంశాలను ఆకళింపు చేసుకుని, విధిగా పాటించాలని ఎలాంటి సందేహాలు

మిగతా 8వ పేజీలో...

తగ్గిన దూర భారం

- నాడు 40 కిలో మీటర్లు..
- నేడు మూడు కిలోమీటర్లు

7

ఆలూర్‌లో హత్య

- రెండు మర్డర్ కేసుల్లో జైలుకు వెళ్లిన గంగారాం
- ఈ మధ్యనే బెయిల్‌పై బయటకు..
- అంతలోనే హత్యకు గురై..

6


మీనాక్షి నటరాజన్‌తో శేఖర్‌గౌడ్

కాంగ్రెస్‌లో బుజ్జగింపుల పర్వం

- డీసీసీ, సీసీసీ పదవులు రానివారిని పిలిచి మాట్లాడిన మీనాక్షి నటరాజన్

నిజామాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో ప్రస్తుతం బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ అధ్యక్షులుగా కొత్తవారిని నియమించడంతో ఆ పదవుల కోసం పోటీపడిన నాయకులను శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌లు హైదరాబాద్‌కు పిలిచి ప్రత్యేకంగా మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ పదవులను ఆశించి నిరాశకు గురైన నాయకులను పిలిచి భవిష్యత్తులో న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు సమాచారం. జిల్లా అధ్యక్ష పదవికి పోటీపడ్డ పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్,

మిగతా 8వ పేజీలో...



బస్సు వస్తదో.. రాదో..?

- సమయపాలన మరిచిన ఆర్టీసీ
- రోడ్లపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు, ఉద్యోగులు
- పని చేయని ఎంక్వయిరీ నంబర్లు
- పట్టించుకోని సంస్థ అధికారులు

సుభాష్‌నగర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అధికారుల తీరు ప్రయాణికులను ఇబ్బందికి గురిచేస్తోంది. నిజామాబాద్ నుంచి ఎల్లమ్మకుంట, ఆర్మూబాద్, మంచిప్పల్, మదన్‌ఎల్లి, శ్రీరాంనగర్ తండా, నర్సింగ్‌పల్లి, మోపాల్ మార్గంలో ఉదయం పూట బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. సమయపాలన కనిపించడం లేదని, కొన్ని సార్లు బస్సులే రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.15 నుంచి 10 గంటల మధ్య బస్సులు రావటమే కష్టంగా మారి ప్రజలను, ముఖ్యంగా ఉద్యోగులను రోడ్లపైనే నిలబెడుతోంది. ఏ సమయంలో బస్సు వస్తుందో తెలియక ప్రభుత్వ శాఖల్లో పనిచేసే సిబ్బంది రోజూ ఆలస్యంతో ఇబ్బందులు పడుతున్నారు. షెడ్యూల్ లేక, సమాచారం లేక బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. "పల్లెల్లో సేవ చేయడానికి వెళుతుంటే ఇంత నిర్లక్ష్యమా?" అని ఉద్యోగులు ప్రశ్నిస్తుంటే సమాధానం ఇచ్చే అధికారి కనిపించడంలేదు. సకాలంలో బస్సులు నడిస్తే

మిగతా 8వ పేజీలో...



ఓపీ నమోదుకు బారులుతీరిన రోగులు
ఓపీ స్లిప్

'ఓపీ'కగా వెళ్లొచ్చు..!

- ఔట్ పేషెంట్లకు వెసులుబాటు
- ఏడు రోజుల పాటు చెల్లనున్న ఓపీ చీటి
- క్యూ లైన్లలో రోగుల నిరీక్షణకు చెల్లు
- జీజీహెచ్‌లో నూతన ఒరవడికి సూపరింటెండెంట్ శ్రీకారం

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఒక్కసారి ఓపీ నమోదు చేసుకుంటే వారం రోజులపాటు చెల్లుబాటయ్యేలా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రోజువారీగా సుమారు 1600నుంచి 2వేల వరకు ఔట్ పేషేంట్‌లు నమోదు చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంగా ఆధునాతన హంగులతో మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించారు. దీంతో జిల్లాతోపాటు మహారాష్ట్ర, బీదర్‌తోపాటు ఇతర జిల్లాల నుంచి సైతం రోగులు జిల్లా ఆసుపత్రికి ప్రతిరోజూ వస్తుంటారు. దీంతో ఓపీ నమోదు విభాగం వద్ద రోగులు క్యూ కడుతున్నారు. ఓపీ వద్ద రోగులు, వారి సహాయకులు బారులుతీరడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సమస్యను అధిగమించేందుకు సూపరింటెండెంట్ దృష్టి సారించారు. ఔట్ పేషెంట్‌ల రద్దీ భారాన్ని తగ్గించేందుకు ఆలోచించారు. ఒక్కసారి నమోదు చేసుకున్న వారికి వారం రోజులపాటు మళ్లీ నమోదు చేసుకోకుండానే నేరుగా వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స తీసుకునేలా అవకాశం కల్పించారు. అదే ఓపీపై డాక్టర్‌లు రెండు మూడు సార్లు మందులు రాసే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఓపీ విభాగం వద్ద రద్దీనే కాకుండా స్టేషనరీకి సంబంధించిన బిల్లులు కూడా మిగిలే అవకాశం ఉంది.

ఓపీ విభాగంలో సిబ్బందికి సౌకర్యాలు కరువు..

ఓపీ విభాగంలో రోగుల నమోదు ప్రక్రియను నిర్వహించే సిబ్బందికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కనీసం కూర్చుండడానికి కుర్చీలు కూడా లేవు. ఉన్న కుర్చీలు సైతం విరిగిపోయి ఉన్నాయి. సరైన కుర్చీలు లేకపోవడంతో కుర్చునేందుకు అట్టముక్కల తో కుర్చీలు తయారు చేసుకుని సిబ్బంది ఓపీ నమోదు సేవలను అందిస్తున్నారు. ఓపీ విభాగంలోని సౌకర్యాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ఓపీ విభాగంలో సిబ్బందికి అట్టముక్కలతో కుర్చీలు


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సీపీ

అవినీతి రహిత సమాజానికి కృషిచేయాలి

- పోలీసు కమిషనర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల సందర్భంగా ఏసీబీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్ కమిషన్ సాయి చైతన్య పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అవినీతి వల్ల వచ్చే నష్టాలు, ఇబ్బందులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి ర్యాలీలు ఉపయోగపడతాయన్నారు. యాంటి కరప్షన్ బ్యూరో ద్వారా క్యూఆర్ కోడ్

మిగతా 8వ పేజీలో...

క్రీడాభివృద్ధికి కృషి

- స్టేడియాల నిర్మాణంపై అసెంబ్లీలో గళం వినిపిస్తా
- సుబ్బారావు స్మారక క్రీడాపోటీల్లో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

8

ఎన్నికల సామగ్రి తరలింపులో జాగ్రత్త వహించాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్‌లాల్

6

కార్పొరేట్ తరహా వైద్యం అందించాలి

- ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్‌రెడ్డి

6

క్రైం సమాచారం

ఆలూర్ మండలంలో హత్య

- రెండు మర్డర్ కేసుల్లో జైలుకు వెళ్లిన గంగారాం
- ఈ మధ్యనే బెయిల్‌పై బయటకు..
- అంతలోనే హత్యకు గురై..

ఆలూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం గొల్ల పెద్ద గంగారాం(48) దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి రెండు పెళ్ళిళ్లు అయి విడాకులయ్యాయి. అప్పటి నుంచి తల్లితోనే ఒక్కడే నివసిస్తూ ఉంటాడు. గొల్ల గంగారాం ఇది వరకే రెండు హత్యలతో సంబంధం ఉండి జైలుకు వెళ్లి ఈ మధ్యనే బెయిల్‌పై ఇంటికి వచ్చారు. ఈ హత్య గురువారం అర్ధరాత్రి జరిగినట్లుగా స్థానికులు ఆరోపిస్తూ ఉన్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనార్టీ గురుకుల విద్యార్థుల అదృశ్యం

కోటగిరి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు అదృశ్యం కలకలం సృష్టించింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పండరి, దీక్షిత్ అనే ఇద్దరు విద్యార్థులు గురువారం రాత్రి 11:30గంటల ప్రాంతంలో బాత్‌రూమ్ పైనుంచి దూకి బయటకు వెళ్లిపోయారు. ఉదయం పాఠశాలలో విద్యార్థుల ఆచూకీ లభించకపోవడంతో సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఇళ్ల వద్దకు విద్యార్థులు రాకపోవడంతో అటు తల్లిదండ్రులు, ఇటు ప్రిన్సిపాల్ ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. విద్యార్థుల ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపటినట్లు ఎస్ఐ వివరించారు. పాఠశాలలో సీసీ ఫుటేజ్ పరిశీలించగా ఇద్దరు విద్యార్థులు గోడ దూకి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. కోటగిరి, బోధన్, నిజామాబాద్ బస్టాండ్ ప్రాంతాలలో సీసీ ఫుటేజ్ పరిశీలించారు. విద్యార్థుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందంతో గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఓ విద్యార్థి రుద్రూర్ మండలంలోని అంబం గ్రామానికి చెందిన పండరి కాగా మరో విద్యార్థి చందూర్ మండలం ఘన్‌పూర్‌కు చెందిన దీక్షిత్ అని తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 35 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి 35 ఏళ్ల జైలు శిక్ష, 50వేల రూపాయల జరిమానా విధిస్తూ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఎస్పీ నితికా పంత్ కథనం ప్రకారం.. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివే బాలిక(16)ను అదే పట్టణంలోని కంఠేశ్వరకాలనీకి చెందిన సాయిచరణ్‌రెడ్డి ప్రేమిస్తున్ననంటూ వెంట పడ్డాడు. ఆమె అంగీకరించక పోవడంతో బాలికను అపహరించి అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఈ మేరకు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2013 ఏప్రిల్ 3న ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. పోక్సో కోర్టు పీపీ శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 35 ఏళ్ల జైలు శిక్షతో పాటు 50వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ముప్కాల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్‌లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మి గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి తల్లిగారింటికి వెళ్లింది. దుండగులు అర్ధరాత్రి తాళం ధ్వంసం చేసి బీరువాలోని 5గ్రా.ల కమ్మలు, రూ.3000 నగదు చోరీ చేశారు. లక్ష్మి శుక్రవారం ఇంటికి రాగా.. ఈ చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శైలేందర్ ఘటనాస్థలాన్ని పరిశీలించి, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చివరి రోజు నామినేషన్ల వెల్లువ

ఆర్మూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు శుక్రవారం చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. మొదటి రెండు రోజుల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు మందకొడిగా సాగిన నామినేషన్లు.. చివరి రోజూ రాత్రి వరకు కొనసాగాయి. వేల్పూర్ మండలం జాన్కంపేట్ సర్పంచ్ స్థానానికి మైలారం(కొలిప్యాక్) సంతోష్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో సర్పంచ్ పదవి ఏకగ్రీవం కానుండగా వార్డు స్థానాలకు పోటీ జరుగనుంది. కమ్మర్‌పల్లి మండలం డీసీతండాలో సర్పంచ్ స్థానానికి ఒక్కరే నామినేషన్ వేశారు. నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది.

● మోర్తాడ్ మండలంలో 10 గ్రామాల్లో శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 33, వార్డుస్థానాలకు 145నామినేషన్లు వేశారు. 3రోజుల్లో సర్పంచ్‌కు 56, వా రు స్థానాలకు 262 నామినేషన్లు వచ్చాయని ఎంపీడీవో తిరుమల తెలిపారు.

● ఏర్గట్ల మండలంలో చివరి రోజు సర్పంచ్ స్థానాలకు 26, వార్డు సభ్యుల స్థానాలకు 107 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో తెలిపారు.

● వేల్పూర్ మండలంలోని 18 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 121 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు.

● డొంకేశ్వర్ మండలంలో మూడో రోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులు జోరుగా నామినేషన్లు వేశారు. 13సర్పంచ్ స్థానాలకు 29, 118 వార్డులకు 116 నామినేషన్లు వచ్చాయి. శుక్రవారం చివరిరోజు సర్పంచు వరకు 65, వార్డు స్థానాలకు 223 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో లింగంతెలిపారు. అత్యధికంగా తొండకూర్ సర్పంచ్ స్థానానికి 10, మారంపల్లి, నూత్‌పల్లి గ్రామాలకు 9 నామినేషన్లు వచ్చాయి. సిర్పూర్ సర్పంచ్ స్థానానికి 2, వార్డు స్థానాలకు 8కి 8 నామినేషన్లు వచ్చాయి. చివరి రోజు భారీగా నామినేషన్లు రావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద ఎస్సై రామ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

అంబంలో అష్టముఖ పోరు

రుద్రూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని అంబం(ఆర్)లో అష్టముఖ పోరు నెలకొంది. గ్రామంలో 10వార్డుల్లో కలిపి 1390 ఓట్లు ఉన్నాయి. బీసీ జనరల్ రిజర్వేషన్ కేటాయించడంతో మొత్తం 8మంది సర్పంచ్‌కుర్చీ కోసం పోటీ పడుతున్నారు. గ్రామంలో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఒక్క అధికార పార్టీ నుంచే ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉండడం గమనార్హం. అధికారికంగా ప్రకటించిన వారు ఒకరు, రెబల్‌గా ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు, టీడీపీ నుంచి ఒకరు, బీఆర్ఎస్ ఒకరు సర్పంచ్ బరిలో ఉన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

ఇందూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 30 పరీక్షల్లో 14వ రోజు పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షలకు 706కి 648 మంది విద్యార్థులు హాజరయ్యారు. 58 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3174కి 2985 మంది విద్యార్థులు హాజరయ్యారు. 192 గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చక్రపాణి తెలిపారు.

జీజీ కళాశాలలో ఐదుగురి డిబార్

ఇందూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీజీ కళాశాల డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఐదుగురు డిబార్ అయినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంగరత్నం తెలిపారు. మొదటి సెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు శుక్రవారం జరిగాయి. మొత్తం 1470కి 1396మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల నియంత్రణ అధికారి భరత్‌రాజ్, అకాడమిక్ కోఆర్డినేటర్లు తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో ప్రజలకు శుక్రవారం ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ యాదగిరి 150 మందికి పరీక్షలు నిర్వహించారు. కాల్షియం కలిగిన ఆహారం తీసుకుంటే ఎముకలు బలహీనపడవని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గ్రీన్ అధ్యక్షుడు ఆకుల రాజు, ప్రతినిధులు శ్రీను, గోపికృష్ణ, గంగాప్రకాష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్ వద్ద బోర్డు లేని వడ్యాట్ రహదారి



నాగాపూర్ రహదారి వద్ద కనిపించని సూచిక బోర్డు

ఏ దారెటుపోతుందో..!

ప్రయాణం సాఫీగా సాగాలంటే దారులు తెలియాలి.. కానీ ఆ దారులు ఎటు వెళ్తున్నాయో తెలియకపోతే గమ్యస్థానాన్ని ఎప్పటికీ చేరుకోలేం. పల్లెదారుల్లో అంటే ఎవరో ఒకరు కనిపిస్తారు.. ఏ దారి ఎటు వెళ్తుందో చెబుతారు. కానీ జాతీయ రహదారిలో ఏ మార్గం ఎటువెళ్తుందో తెలియాలంటే గ్రామాల సూచిక బోర్డులు అనేవి కీలకం. అవి లేకపోతే జాతీయ రహదారుల్లో ఎంతో దూరం వెళ్తే గానీ ఎవరూ కనిపించరు. కమ్మర్‌పల్లి జాతీయరహదారి నుంచి తిమ్మాపూర్, నాగాపూర్, బషీరాబాద్ గ్రామ శివారుల్లో నుంచి వడ్యాట్ మీదుగా మోర్తాడ్ వెళ్లేందుకు రహదారులు ఉన్నప్పటికి ఎలా వెళ్లాలనేది సూచిక బోర్డులు లేవు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తికమకపడుతున్నారు. జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లలో గతంలో గ్రామాల పేర్లు, దూరంతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ఆ బోర్డులు నేడు కనిపించకుండా పోయాయి. అధికారులు స్పందించి బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఫొటోలు, కమ్మర్‌పల్లి**



జాతీయరహదారి వద్ద తిమ్మాపూర్ మార్గంలో కనిపించని సూచికలు



అంక్సాపూర్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

వేల్పూర్/కమ్మర్‌పల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా ఎన్నికల అధికారులకు సూచించారు. శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రం, అంక్సాపూర్, కమ్మర్‌పల్లి మండలకేంద్రంతో పాటు చౌట్‌పల్లి, కోనాసమందర్‌లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని సర్పంచ్, వార్డుసభ్యుల నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియలో ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సూచించారు. ఆయన వెంట వేల్పూర్ ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో సాయిలు, కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజాశ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో సదాశివ్ ఉన్నారు.

ఎన్నికల సామగ్రి తరలింపులో జాగ్రత్త వహించాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్‌లాల్



ఆర్మూర్‌లో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు

కమ్మర్‌పల్లి/ఆర్మూర్/భీమ్‌గల్ రూరల్/ముప్కాల్/మెండోరా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సామగ్రి తరలింపులో జాగ్రత్తలు వహించాలని, ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి, ఆర్మూర్ మండలకేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రిని ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అలాగే కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, కోనాసమందర్, భీమ్‌గల్ మండలంలోని జాగిర్యాల్, బాల్కొండ మండలకేంద్రం, మెండోర మండలం పోచంపాడ్‌లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. సర్పంచ్, వార్డు సభ్యుల కోసం నామినేషన్లు వేయడానికి వచ్చిన వారితో మాట్లాడారు. హెల్ప్ సెంటర్లో ఉన్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. భీమ్‌గల్ మండల పరిషత్తు కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట డీఎల్‌పీవో శివకృష్ణ, ఆర్మూర్ ఎంపీడీవో శివాజీ, కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ జి. ప్రసాద్, ఎంపీవో సదాశివ్, భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ షబ్బీర్, ఎంపీవో జావిద్ అలీ, ఎస్ఐ సందీప్, బాల్కొండ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి, ఎంపీవో గంగమోహన్, పంచాయతీ సెక్రటరీ రజనీకాంత్, మెండోరా ఎంపీడీవో లక్ష్మణ్, ఎస్సై సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి నామినేషన్ స్వీకరణ కేంద్రంలో బారులు తీరిన అభ్యర్థులు

సాయంత్రమైనా సందడే..!

కమ్మర్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో శుక్రవారం నామినేషన్ల జోరు కొనసాగింది. నామినేషన్ల సమర్పణకు ఆఖరు రోజు కావడంతో కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీలో సాయంత్రం 5 దాటినా సర్పంచ్, వార్డు సభ్యులు తమ నామినేషన్లు సమర్పించడానికి బారులుతీరారు. సాయంత్రం 5 దాటగానే గ్రామపంచాయతీ గేట్లు మూసివేయగా.. అప్పటికే లోపలికి వచ్చిన వారు బారులు తీరాడంతో రాత్రి వరకు నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కొనసాగిచాల్సి వచ్చింది. మండలంలోని 4 క్లస్టర్‌లలోని 14 గ్రామపంచాయితీలు, 136 వార్డులకు సమర్పించుకున్న నామినేషన్ల సంఖ్య తెలపడం ఆలస్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

తిరుపతిరెడ్డికి రైతురత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న పి. తిరుపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మనోహరాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పరిశ్రమ చైర్మన్ పి.తిరుపతిరెడ్డి రైతు రత్న అవార్డును శుక్రవారం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగా రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పీ ద్వారా సబ్సిడీ తీసుకొచ్చి ఐదు గ్రామాల రైతులను ఏకం చేసి సొసైటీని ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో ఏకైక పసుపు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమ నెలకొల్పారని తిరుపతిరెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో రైతు ఉత్పత్తుల సంఘ ఎన్నో పరిశ్రమలను నెలకొల్పి రైతులకు సహకరించాలన్నారు.

ఆర్మూర్, కోమన్‌పల్లి బడులు భేష్



కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న హెచ్‌ఎంలు

ఆర్మూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోమన్‌పల్లి, ఎంపీపీఎస్ నవనాథపురం పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ కార్యక్రమంలో పురస్కారాలు లభించాయి. జిల్లాస్థాయిలో ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఎస్‌హెచ్‌వీఆర్ (స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్)లో పొందుపర్చిన 16 అంశాల్లో ఉన్నత ప్రమాణాలు పాటించి పాఠశాల పరిసరాలను ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా ఉంచినందుకు పురస్కారాలు లభించాయి. ప్రధానోపాధ్యాయులు కవిత, విజయ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను శుక్రవారం అందుకున్నారు. అవార్డులు అందుకున్న హెచ్‌ఎంలను డీఈవో అశోక్ అభినందించారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న బోధన్ పోలీసులు

సాలూర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలకేంద్రంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండాలనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విజయ్‌బాబు, బోధన్ పట్టణ రాణా ఎస్‌హెచ్‌వో వెంకట నారాయణ, ఎస్సైలు మచ్చేందర్‌రెడ్డి, రమ, చంద్రమోహన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ తరహా వైద్యం అందించాలి

- ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్‌రెడ్డి



లయన్స్ క్లబ్‌ను సందర్శిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు

బోధన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోధన్ లయన్స్ ఆసుపత్రిలో కార్పొరేట్ తరహాలో ప్రజలకు ఆత్యాధునిక వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో గల లయన్స్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. అనంతరం లయన్స్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు, కొడాలి కిషోర్, నాగేశ్వర్ రావు, నర్సింహ రెడ్డి, ప్రకాష్ గుప్తా, సురేందర్‌లతో కలిసి ఆసుపత్రి నిర్వహణపై సమీక్షించారు. సమన్వయంతో పేదలకు కార్పొరేట్ తరహా మెరుగైన వైద్య సేవలు తక్కువ ఫీజుతో అందించాలన్నారు. లయన్స్ ప్రతినిధి బసవేశ్వర్ రావు మాట్లాడుతూ.. త్వరలోనే ఆరోగ్యశ్రీ సేవలు బోధన్ పరిసరా ప్రాంత ప్రజలకు అందుబాటులోకి రానున్నాయన్నారు. లయన్స్ క్లబ్ అందిస్తున్న వైద్య సేవలను ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ డెలిగేట్ గంగాశంకర్, లయన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులను సన్మానించారు. ఎన్నికలలో ప్రజలు డబ్బులు వృథా చేసుకోవద్దని, గ్రామాలకు నిధులు తెచ్చే వారినే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని సూచించారు.

సాలూర మండలంలో ప్రచారం..

సాలూర: మండలంలోని సాలూర, జాడిజమాల్‌పూర్‌లో సర్పంచ్ అభ్యర్థులతో కలిసి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాడి సర్పంచ్ అభ్యర్థి శారి హారికకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర రావు, శంకర్, నరేందర్ రెడ్డి, జనార్ధన్, సుందర్ రాజు, అల్లె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ తల్లి లక్ష్మి గుండెపోటుతో శుక్రవారం ఉదయం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బాధిత కుటుంబీకులను కలిశారు. లక్ష్మి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే వారికే ఓటేయండి

రుద్రూరు,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అభివృద్ధి చేసే వారికి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికలలో భాగంగా రుద్రూర్ మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామ మాజీ సర్పంచ్ షేక్ ఖదర్ సతీమణి ఆఫ్రిన్ బేగం సర్పంచ్ బరిలో నిలిచారని ఆమెను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అరుణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ గంగారాం, నాయకులు సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగుకు సన్నద్ధం



మోతె శివారులోని పొలాల్లో పోసిన వరి నారు మడి

వేల్పూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో యాసంగి పంట సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం పొలంలో మడులను చదును, లెవల్ చేసుకోవడం, ఒడ్లు సరిచేసుకోవడం, దుక్కులు చేయడం వంటి పనులతో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు. పొలాలను దమ్ము చేయిస్తూ నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. బోర్ల ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు వరి పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. నీటి సౌకర్యం తక్కువగా ఉన్న రైతులు శనగ, మొక్కజొన్న, తొగర్లు వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించారు. మరికొంత మంది రైతులు పామాయిల్, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో మండలంలో సుమారు 22వేల ఎకరాల వరకు పంటలను సాగు చేసే అవకాశం ఉంది. పంటల సాగుకు ఎరువులు, మందులు సకాలంలో అందుబాటులో ఉంచాలని రైతులు వ్యవసాయాధికారులను కోరుతున్నారు.

పంటల సాగు పై సూచనలు ఇస్తున్నాం...

యాసంగిలో సాగుచేసే వివిధ పంటలపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నాం. వానాకాలం సీజన్ పనులు ముగియడంతో రైతులు యాసంగి సీజన్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మేము క్షేత్రస్థాయికి వెళ్లి ఏ భూమిలో ఏ పంటలు వేస్తే దిగుబడి వస్తుందో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. అవసరమైన విత్తనాలు, ఎరువులు నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- రాజు, మండల వ్యవసాయాధికారి, వేల్పూర్

కేజీబీవీలో నీటికష్టాలు తీరాయ్..!



కేజీబీవీలో బోర్ వేస్తున్న దృశ్యం

భీమ్‌గల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'రోడ్డెక్కిన కేజీబీవీ విద్యార్థినులు' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆ పాఠశాలలో నీటి సమస్యను తీర్చేందుకు బోర్ వేయించారు. పాఠశాలలో ఉన్న బోర్ చెడిపోయి నీటికి విద్యార్థులు కష్టాలు ఎదుర్కొని గురువారం ముందు ప్లేట్లతో నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో స్పందించి అధికారులు పంచాయతీరాజ్ శాఖ ద్వారా పాఠశాలలో బోరు వేయించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

ముప్కాల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ శుక్రవారం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. 5-10 తరగతుల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు స్కాలర్షిప్ దరఖాస్తులకు ఈనెల 30లోపు అవకాశం ఉందన్నారు. విద్యార్థి కుల, ఆదాయం, బ్యాంక్ అకౌంటు పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసిన పత్రాలతో జత చేసి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని సూచించారు. 5- 8వ తరగతి బాలురకు రూ1000, బాలికలకు రూ.1500, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.3500 స్కాలర్షిప్ వస్తుందన్నారు.

లింగాపూర్‌లో తోటి కోడళ్ల పోటీ



దూడల శ్యామల - దూడల మంజుల

నిజామాబాద్ జిల్లాలోని నవీపేట మండలంలోని లింగాపూర్‌లో సర్పంచ్ పదవికి తోటి కోడళ్ల పోటీ పడుతున్నారు. సర్పంచ్ పదవి బీసీ మహిళకు కేటాయించగా కోరే లావణ్య, మాడబోయి నిత్యశ్రీ, దూడల శ్యామల, దూడల మంజుల అనే నలుగురు మహిళలు సర్పంచ్ పదవికి నామినేషన్‌లు దాఖలు చేసి పోటీలో నిలిచారు. ఇందులో దూడల శ్యామల, దూడల మంజులతోటి కోడళ్లు కావడం విశేషం.

గుండారంలో అన్నదమ్ముల సవాల్

తమ్ముడిపై పోటీకి ఇజ్రాయిల్ నుంచి వచ్చి..



అంకల గంగాధర్ - అంకల లక్ష్మణ్

నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి సొంత అన్న దమ్ములు పోటీపడుతున్నారు. అంకల గంగాధర్ ఒకసారి ఎంపీటీసీ, ఆయన భార్య అంకల సవిత ఒకసారి ఎంపీటీసీగా గెలిచారు. అంకల గంగాధర్ అన్న అంకల లక్ష్మణ్ తెలంగాణ ఉద్యమ కాలంలో చురుగ్గా పనిచేశారు. ఉపాధి కోసం ఇజ్రాయిల్ దేశానికి వెళ్లి అక్కడే 20 ఏళ్లు పనిచేశారు. సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయని తెలిసి ఇజ్రాయిల్ నుంచి గుండారం వచ్చారు.



గల్ఫ్ నుంచి వచ్చి....



కలిగోట్ సర్పంచ్ అభ్యర్థి అనిల్ కుమార్

జక్రాన్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ నుంచి వచ్చి జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామ సర్పంచ్ స్థానానికి గ్రామానికి చెందిన సీ. అనిల్ కుమార్ పోటీలో ఉన్నారు. కలిగోట్ సర్పంచ్ స్థానం బీసీ జనరల్ రిజర్వేషన్ అయ్యింది. ఈ సర్పంచ్ స్థానానికి గ్రామానికి చెందిన 9 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. కలిగోట్ సర్పంచ్ స్థానం బీసీ జనరల్ రిజర్వేషన్ అయిందని తెలిసుకుని దుబాయిలో ఉంటున్న గ్రామానికి చెందిన అనిల్ కుమార్ స్వగ్రామం కలిగోట్ కు చేరుకున్నారు. సర్పంచ్ స్థానానికి నామినేషన్ లు వేసి బరిలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే దాకా

బాల్కొండ మాజీ ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం



స్వర్గీయ మధుసూధన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే బాల్కొండ

ఆర్మూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఎంత ఉన్నత స్థానానికి చేరుకున్న నాయకులైన వారి మూలాలు పునాది సర్పంచ్ పదవి నుంచే ప్రారంభమవుతుంది. రాజకీయ నాయకులు ఓనమాలు నేర్చుకునేది ఇక్కడే. ఎందరో నాయకులకు రాజకీయ ప్రస్థానం సర్పంచ్ స్థాయి నుంచి మొదలవుతుంది. అలాంటి కోవకు చెందిన వారే బాల్కొండ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గడ్డం మధుసూధన్‌రెడ్డి.

మధుసూధన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ..

ఆర్మూర్ మండలం పెర్కిట్ గ్రామానికి చెందిన మధుసూధన్ రెడ్డి 1962లో పెర్కిట్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1972 నుంచి 75 వరకు ఆర్మూర్ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. 1983 లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బాల్కొండ నుంచి బరిలో నిలిచి విజయం సాధించి రెండు పర్యాయాలు నియోజక వర్గ ప్రజలకు సేవ లందించారు. ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఉప నాయకునిగా, పబ్లిక్ అండర్ టేకింగ్ ఛైర్మన్‌గా పని చేశాడు. 1985 నుంచి 88 వరకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీకి అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ఛైర్మన్‌గా వ్యవహరించగా మధుసూదన్‌రెడ్డి వైస్ ఛైర్మన్‌గా కీలక పాత్ర పోషించారు. ఆర్మూర్ ఎల్‌ఎంబి బ్యాంక్ అధ్యక్షుడిగా, ఏపీ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి సేవలందించారు.

ఇజ్రాయిల్ నుంచి వచ్చి పచ్చల నడ్కుడ సర్పంచ్ అభ్యర్థిగా..



కోలె నర్సయ్య

వేల్పూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలపై ఉన్న మక్కువతో విదేశాలలో లక్షల సంపాదన ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సొంతూరుకు వచ్చి సర్పంచ్‌గా బరిలో నిలిచారు. వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామ పంచాయితీ సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో ఇజ్రాయేల్‌లో ఉద్యోగం చేస్తున్న ఇదే గ్రామానికి చెందిన కోలె నర్సయ్య హుటాహుటిగా గ్రామానికి వచ్చి సర్పంచ్ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నర్సయ్య గతంలో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. సర్పంచ్ బరిలో నిలవ డానికి ఇజ్రాయేల్ నుంచి ఆకస్మత్తుగా రావడంతో పోటీ రసవత్తరం కానుంది.

వేలం.. వెర్రీ

బాద్గుణలో 9వ వార్డుకు వేలం

» రూ.56 వేలు పలికిన ధర

నందిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాద్గుణ గ్రామంలో వేలం వెర్రీ జరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో గ్రామంలోని 9వ వార్డును ఎస్సీ - జనరల్ కేటగిరి అధికారు లు కే టాయించారు. శుక్రవారం నామినేషన్ల పర్వం ముగుస్తుండడంతో ఆ వార్డుకు వేలం పాట నిర్వహించారు. విశ్వసనీ య సమాచారం మేరకు 9వ వార్డుకు నలుగురు వ్యక్తులు పోటీ పడ్డారు. వేలం పాట నిర్వహించగా ఓ మహిళా 56వేలు వరకు పాట పాడి వార్డును ఏకగ్రీవం కానుంది. అయితే మరో మహిళా రూ.55 వేలు వరకు వేలం పాట పాడి అక్కడే ఆగిపోయింది. రూ.వెయ్యి ఎక్కువ పాడిన సత్యగంగు పంచాయతీలో కూర్చోనుంది. గ్రామాభి వృద్ధి కమిటీల జోక్యం ఉండ కూడదని, వేలం పాటలు నిర్వహించ వద్దని ఒక పక్కా ఎన్నికల కమిషన్ ఆ దేశిస్తే, మరో పక్కా జిల్లా యంత్రాంగం వాటిని రద్దు చేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తుండగా వేలం పాట జరిగింది. దీనిపై అధికారు లు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

మద్నూర్‌లో బీఆర్ఎస్ భారీ ర్యాలీ



మద్నూర్ బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి తరపున ర్యాలీలో పాల్గొన్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే

మద్నూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ తమ శక్తి, ఐక్యత, ప్రజాదరణ చాటుకుంది. జుక్కల్ మాజీ శాసన సభ్యులు హన్మంత్ షిండే ముఖ్యఅతిథిగా పాల్గొని బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఈశ్వరమ్మ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా బీఆర్ఎస్ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా బ్యాండ్ మేళాలు, పెద్ద ఎత్తున టపాకాయలు పేలుస్తూ, మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ కొనసాగింది. వందలాది మంది కార్యకర్త లు, అభిమానులు, మహిళలు, యువత ర్యాలీలో పాల్గొని బీఆర్ఎస్ అభ్యర్థికి తమ అండగానూ, ఐక్యంగానూ నిలబడ్డారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ మద్నూర్ అభివృద్ధి కోసం బలమైన నాయకత్వం అవసరమని ఆ బాధ్యతను అందుకోగల నాయకురాలు ఈశ్వరమ్మ. గ్రామాభివృద్ధి, సేవ, పారదర్శకత ఇవన్నీ బీఆర్ఎస్ లక్షణాలని. ప్రజల ఆశీర్వాదంతో మద్నూర్ మరింత ముందుకు సాగుతుందని అన్నారు. మద్నూర్ నామినేషన్ కేంద్రంలో సర్పంచ్ అభ్యర్థిగా ఈశ్వరమ్మ నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ భారీ ర్యాలీతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.

భార్య ఓ చోట.. భర్త మరో చోట పోటీ



వెల్మల్‌లో వివిధ వార్డులకు పోటీ చేస్తున్న భార్య, భర్త

నందిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మల్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వివిధ వార్డులకు భార్య, భర్త ఇద్దరు పోటీ చేస్తున్నారు. 8వ వార్డులో ఇస్సాపల్లి నవ్య రాణి నామినేషన్ దాఖలు చేయగా 9, 10 వార్డులలో భర్త ఇస్సాపల్లి మహేష్ నామినేషన్ వేశారు. వీరిద్దరు వార్డు సభ్యులుగా పోటీల్లో ఉండనున్నారు. గ్రామంలో అందరి చూపు ఆ వార్డులపైనే పడింది. అయితే భార్య ఇస్సాపల్లి నవ్యరాణి 8వ వార్డులో పోటీకి సై అనగా భర్త మాత్రం 9వ వార్డా, 10వ వార్డా అనే డైలామాలో పడ్డారు.

ఏకశిల శివలింగానికి భక్తుల పూజలు



బుస్సాపూర్ 44వ జాతీయ రహదారి వద్ద పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

మెండోర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో కెల్లా అతి పెద్ద ఏకశిల శివలింగన్న బుస్సాపూర్ 44వ జాతీయ రహదారిపై అయ్యప్ప స్వాములు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడులో మహబలిపురం సప్తపతులు పదేళ్ల శ్రమించి 33 అడుగుల ఎత్తు, 210 మెట్రిక్ టన్నుల బరువున్న లింగన్ని రూపొందించారు. ఈ శివలింగాన్ని 96 చక్రాలు ఉన్న బారి ట్రక్కులో తరలిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఏకశిల శివలింగాన్ని బీహార్‌లో చాకియ కేసరియా రహదారిపై ఉన్న విరాట్ రామాయణ మందిరంలో స్థాపించనున్నారు. ఈ ఏకశిల శివలింగం మెండోరా మండలంలోని ప్రవేశిస్తున్న విషయం తెలుసుకున్న అయ్యప్ప స్వాములు, భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

తగ్గిన దూర భారం

» నాడు 40 కిలో మీటర్లు..

» నేడు మూడు కిలోమీటర్లు



గుడి లింగాపూర్‌కు చెందిన ఒకే కుటుంబసభ్యులు ఇందులో 56 మంది ఓటర్లు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో కమ్మర్‌పల్లి మండలం మానాల అనుబంధ గ్రామంగా ఉన్న గుడి లింగాపూర్ గ్రామ ఓటర్లకు ఓటుహక్కు వినియోగించుకోవడానికి దూరభారం తగ్గుతూ వస్తుంది. గతంలో 28 కిలోమీటర్ల దూరం వచ్చి మానాలలోని 151వ పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకునే వారు. ఆ సమయంలో మానాలకు అనుబంధ గ్రామంగా ఉన్నా గుడిలింగాపూర్‌ను మానాలకు కలిపితే జిల్లాకు దట్టమైన అటవి ప్రాంతం కోల్పోవలసివస్తుందని ఈ గ్రామాన్ని జిల్లాలోనే ఉంచుతూ అక్కడి నుంచి 40 కిలోమీటర్ల దూరంలో గల కోనాసమందర్ గ్రామ పంచాయితికి అనుబంధ గ్రామంగా కలిపారు. తదుపరి జరిగిన అసెంబ్లి, పార్లమెంట్ ఎన్నికల్లో గుడిలింగాపూర్ ఓటర్లకు దూర భారం తగ్గించాలని అదే గ్రామంలో 143 వ పోలింగ్ బూత్ గా ఏర్పా టు చయడంతో గ్రామానికి చెందిన 36 మం ది తమ గ్రామంలోనే తొలిసారి ఓటుహక్కు వినయోగించుకున్నారు. అయితే ఈ నెల 17న జరుగనున్న గ్రామపంచాయితీ మూడవవడత ఎన్నికలకు ఈ గ్రామాన్ని రెండున్నర కిలోమీటర్ల దరాన ఉన్న సిరికొండ మండలం చీమన్ పల్లి గ్రామానికి అనుసందానం చేస్తు చీమన్ పల్లి గ్రామ పదవ వార్డుగా గుడిలింగాపూర్‌ను గుర్తిస్తు ప్రభుత్వం తాజాగా గెజిట్‌విడుదల చేసింది. దీంతో గుడిలింగాహూర్ గ్రామంలోని ప్రస్తుత ఓటర్లు 56 మంది (26 పురుషులు మంది స్త్రీలు) తమ ఓటుహక్కు ను చీమన్ పల్లి జీపి పదవవార్డుగా వినియోగించుకోనున్నారు

విద్యార్థులను అభినందించిన పోచారం



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో క్రమశిక్షణ, జాతీయ స్ఫూర్తిని పెంపొందించే దిశగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో 19వ జాతీయ జంబోరి కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని న్యూటన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జంబోరిలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బంది తదితరలున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

వేల్పూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారుల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఎన్నికల నేపధ్యంలో మండలానికి సరిహద్దులో ఉన్న రహదారులపై వస్తున్న వాహనాలను తహసీల్దార్ శ్రీకాంత్‌తో పాటు ఇతర రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వాహనాలలో మద్యం, 50వేలకు మించి డబ్బులు తీసుకెళ్తే వాటిని సీజ్ చేసి చట్టపర మైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు.

నామినేషన్ స్వీకరణ కేంద్రాల పరిశీలన ..

మండలంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. నామినేషన్‌ల స్వీకరణ చివరి రోజు వరకు సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి నామినేషన్ ఎన్ని దాఖాలు అయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన



క్యూఆర్ కోడ్ విధానంపై అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఆర్మూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈవ్ టీజింగ్‌పై షీటీం సబ్ డివిజన్ కానిస్టేబుల్‌లు విఘ్నేష్, సుమతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఈవ్ టీజింగ్ చేసిన షీటీంకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. వేదింపులు, ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయ పడకుండా తమకు సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా షీటీంకు ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. బాధితులు షీటీం నెంబర్ 87126 59795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నవీన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మద్నూర్ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు

మద్నూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో జుక్కల్ శాసన సభ్యులు పాల్గొన్నారు. మద్నూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఉషా సంతోష్ మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. నామినేషన్ కార్యక్రమానికి జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీ కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని గుర్తు చేశారు. పెద్ద ఎక్లారా గ్రామ సర్పంచ్ అభ్యర్థి మహేష్, ధన్నూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి జయశ్రీ దేవీదాస్, రాచూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఆకాష్‌లతో కలిసి నామి నేషన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు.

తొర్లికొండ పాఠశాలకు స్టడీ కుర్చీలు వితరణ



పాఠశాల విద్యార్థులకు స్టడీ కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

జక్రాన్‌పల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీపీ ఉన్నితన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఆర్ఐ అనందవల్లి మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్టడి కుర్చీ లను వితరణ చేశారు. పాఠశాల విద్యార్థులకు 25వేల రూపాయల విలువ గల 25 స్టడీ కుర్చీలను, రైటింగ్ ప్యాడ్‌లను ఎన్ఆర్ఐ ఆనందవల్లి అందజేసినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్ తెలిపారు. గత ఏడాది ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తువులు, స్టడి కుర్చీలు, టీషర్టులు అందజేశారన్నారు. ఈ సందర్భంగా వీపీ ఉన్నితన్ ఫౌండేషన్ ఎన్ఆర్ఐ కేరళకు చెందిన ఆనందవల్లి అందజేశారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఫౌండేషన్ ఎన్ఆర్ఐ ఆనందవల్లికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగమోహన్, వీడీసీ చైర్మన్ గంగాధర్, కార్యదర్శి భూమేశ్వర్, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో లీడ్ కాన్ఫరెన్స్



విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో రాజ గంగారాం

పెర్కిట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో శుక్రవారం పాఠశాల యాజమాన్యం రామకృష్ణ ఆధ్వర్యంలో లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో రాజగంగారాం పాల్గొని మాట్లాడుతూ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనల ను అభినందించారు. అదేవిధంగా ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు సబ్జెక్టుపై అవగాహన పెంచుతాయని అన్నారు. కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చాలా రకాల సబ్జెక్టు పరమైన ప్రదర్శనలు చేశారని అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఇలాంటి సృజనాత్మకమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ప్రచారంలో పదనిసలు..



సంగమేశ్వర్‌లో బాబుకు చిప్స్ ప్యాకెట్ ఇస్తున్న సర్పంచ్ అభ్యర్థి

దోమకొండ, (బీబీపేట) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ పడే అభ్యర్థులు ప్రచారంలో చిన్న, పెద్ద వ్యక్తులు అని తేడా లేకుండా మర్యాదగా మాట్లాడుతూ ముందుకు వెళుతున్నారు. సంగమేశ్వర్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఒకరు బాబును బైక్‌పై తీసుకెళ్తున్న తండ్రి బైక్ ఆపి కిరాణం దుకాణంలో చిప్స్ తీసుకుని బాబుకు ఇచ్చారు. మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో నత్తి సంజీవ్, నత్తి గణేష్ అనే ఇద్దరు వ్యక్తులు అన్నదమ్ముల పిల్లలు పోటీలో ఉన్నారు. అలాగే సంగమేశ్వర్‌లో మాజీ సర్పంచ్ లోయపల్లి లత భర్త శ్రీనివాస్‌రావు పోటీలో ఉన్నారు. సీతారాంపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ నత్తి శోభ భర్త సంజీవ్ పోటీలో నిలబడ్డారు. ఇలా ఒక్కో గ్రామంలో సర్పంచ్, వార్డుల వారిగా సైతం భార్యలు మాజీలుగా ఉన్న వారి భర్తలు, భర్తలు మాజీలుగా ఉన్న వారి భార్యలు పోటీలో ఉన్న సంఘటనలు గ్రామాల్లో నెలకొన్నాయి. దీంతో గ్రామాల్లో పోటీ రసవత్తరంగా మారింది.

13 మందిపై కేసు నమోదు

బీర్కూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఘటనలో 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. భైరాపూర్ గ్రామంలో గురువారం ఎన్నికల అధికారి నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎన్నికల నామినేషన్ ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఎస్‌టీ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పందుల సుధారాణితో పాటు ద్రోణవల్లి సతీష్, పందుల సుధారాణి, పందుల రాములు, కుమ్మరి అజయ్, నెమలి సాయిలు, టైలర్ పాషా, బేగరీ అంజయ్య, మేకల లక్ష్మణ్, బొమ్మ లక్ష్మణ్, తనబుద్ధి సాయిలు, తనబుద్ధి శ్రీనివాస్, పందుల నారాయణ, పందుల లింగయ్య, మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. శుక్రవారం వారిని తహసీల్దార్ సాయి భుజంగరావు వద్ద బైండోవర్ చేశారు.

నామినేషన్‌ల ఉపసంహరణకు

నేటితో ముగియనున్న గడువు

» రెండో విడతకు మధ్యాహ్నం మూడు గంటల లోపే గడువు

» తేలనున్న ఏకగ్రీవ సర్పంచ్, వార్డుల స్థానాలు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు రెండో విడత జరుగనున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈ నెల 6వ తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలోపుతో ముగియనుంది. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలనుకునే అభ్యర్థులు శనివారం మధ్యాహ్నం మూడు గంటలలోపు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రచురణ జరుపుతారు. అనంతరం ఎన్నికల బరిలో నిలిచిన సర్పంచ్‌ల, వార్డు స్థానాల అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు. జిల్లాలో రెండో విడతలో గాంధారి, లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని 197 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు, 1654 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో నామినేషన్ల ఉపసంహరణ గడువు సమయం ముగిసాక రెండో విడత ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌ల, వార్డుల స్థానాలు తేలనున్నాయి. అలాగే ఎన్నికలు జరగనున్న సర్పంచ్‌ల, వార్డుల స్థానాలు తేలనున్నాయి. ఏకగ్రీవం కానీ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డుల స్థానాలకు ఎన్నికలు జరుగుగన్నాయి.

బీజేపీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్‌లో పాల్గొన్న మాజీ ఎంపీ



మద్నూర్‌లో అర్చన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న జహీరాబాద్ మాజీ ఎంపీ

మద్నూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల మేజర్ గ్రామ పంచాయతీ సరంచ్ అభ్యర్థిగా బీజేపీ బలపరిచిన అర్చన కృష్ణ పటేల్ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ హాజరయ్యారు. మండల కేంద్రంలో ర్యాలీగా నిర్వహించి నామినేషన్ కేంద్రానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని గుర్తు చేశారు.

ఆర్మీలో చేరిన యువకుడికి సన్మానం



ఆర్మీలో చేరిన యువకుడికి సన్మానం

నాగిరెడ్డిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అగ్నివీర్‌లో ఎంపికై, ఆర్మీ శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరిన నాగిరెడ్డి పేటకు చెందిన మన్నే సాయి కిరణ్ ను శుక్రవారం స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించి అభినందించారు. మండల యువకులు సాయి కిరణ్‌ను స్ఫూర్తిగా తీసుకొని సైనిక దళాలు, పారా మిలిటరీ దళాల్లో ఉద్యోగాలు సాధించేందుకు ప్రయత్నించాలనీ ఆయన ఈ సందర్భంగా కోరారు. ఆర్మీలో ఉద్యోగాలు ఎలా పొందాలి, ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుంది తదితర విషయాల్లో ఎవరి కైనా ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.

నవీపేట గ్రామాభివృద్ధియే నా ధ్యేయం

» సర్పంచ్ అభ్యర్థి కేఎల్‌వీ రేఖ రాజేందర్ గౌడ్



నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కేఎల్‌వీ రేఖ రాజేందర్ గౌడ్

నవీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధియే నా ధ్యేయమని సర్పంచ్ అభ్యర్థి కేఎల్‌వీ రేఖ రాజేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ తన మద్దతుదారులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివిన తాను గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. నా భర్త కేఎల్‌వీ రాజేందర్ గౌడ్ గతంలో నవీపేట ఎంపీపీగా పని చేసి మండల అభివృద్ధికి తనవంతు కృషి చేశారని ఆమె వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సహకారంతో నవీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, అంగడి బజార్‌లో సీసీ రోడ్లు, నెహ్రూ రోడ్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం, బాసర రోడ్డు మూల మలుపు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం, గ్రామంలో విద్య, వైద్య సదుపాయాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు, మహిళలు, యువతకు ప్రత్యేక ఉపాధి సదుపాయాల కల్పన వంటి వాటికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. గ్రామస్థులు ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

టెట్ సమస్యను పరిష్కరించాలి

» కేంద్రమంత్రిని కోరిన ఎంపీ అరవింద్

నిజామాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి టెట్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విషయంలో నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధర్మపురి శుక్రవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నిర్ణయం వల్ల నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని 3వేలకు పైగా ఉపాధ్యాయులపై ప్రభావం చూపుతుందని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను పరిశీలించి చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సైనికుల కృషితో ప్రశాంత వాతావరణం

» కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సైనికుల కృషి వల్లే ప్రశాంత వాతావరణంలో జీవనాలు వెళ్లదీస్తున్నామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ నుంచి చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఉద్దేశించిన సహాయ నిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టర్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, గౌరవ వందనం సమర్పించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్‌తో పాటు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి తమవంతుగా విరాళాలు అందించారు. దేశ రక్షణ కోసం సాయుధ దళాలకు చెందిన సైనికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, రేయింబవళ్లు శ్రమిస్తున్నారన్నారు. సైనికుల త్యాగాలను ప్రతి పౌరుడు గుర్తిస్తూ, వారి పట్ల, వారి సేవల పట్ల గౌరవభావంతో మెలగాలని, సాయుధ దళాలకు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. వారి గౌరవార్థం ప్రతి ఏటా నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని వచ్చే ఏడాది నుంచి మరింత అట్టహాసంగా నిర్వహించాలని, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలన్నారు.

పాఠశాలలకు ప్రశంసాపత్రాలు

కేంద్రం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్‌లో ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిన పాఠశాలలకు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బడుల హెచ్‌ఎంలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాలల మౌలిక వసతులను రూపుదిద్దడంలో విశేష కృషిచేసిన 8 మంది హెచ్‌ఎంలను డీఈవో అశోక్ అభినందించారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డితో నక్కలగుట్టతండావాసులు

నక్కలగుట్ట తండా ఏకగ్రీవం

» రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి అభినందన

నిజామాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలం నక్కలగుట్ట తండా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా లకావత్ దేవిసింగ్, వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. శుక్రవారం నగరంలోని క్యాంప్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డిని కలిశారు. ఏకగ్రీవమైన సర్పంచ్ లకావత్ దేవీసింగ్, వార్డు సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. సర్పంచ్ ఎన్నికలు లేకుండా గ్రామాన్ని ఏకగ్రీవం చేసినందుకు నక్కలగుట్టతండా వాసులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభినందించారు. అభివృద్ధి కోసం తన నిధుల్లోంచి కొన్ని మంజూరుచేస్తానని తెలిపారు. నక్కలగుట్ట తండాతో పాటు మరో మూడు తండాలు కూడా ఏకగ్రీవం కావడం అభినందనీయమన్నారు. ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, గ్రామపెద్దలు చందర్ నాయక్, రమేష్ నాయక్, నారాయణ మునిరామ్, రవి నాయక్, సుదర్శన్ మోబిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పక్షాన టీఎన్‌జీవోస్ పోరాటం

» సమస్యల పరిష్కారానికి కృషి
» ఉద్యోగులందరూ సంఘం సభ్యత్వం తీసుకోవాలి
» సంఘం జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పక్షాన పోరాడే సంఘం టీఎన్‌జీవోస్ మాత్రమేనని జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లోని టీఎన్‌జీవో కార్యాలయంలో వ్యవసాయశాఖ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగులందరూ టీఎన్‌జీవోస్ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. అంతకముందు ఇటీవల మరణించిన కల్యాణ్ ఆత్మకు శాంతి చేకూరాలను రెండు నిమిషాల మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, వ్యవసాయశాఖ ఫోరం అధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, సునిల్, ముఖ్య సలహాదారు సుధాకర్ పాల్గొన్నారు.



టీఎన్‌జీవోస్ సభ్యత్వం తీసుకున్న వ్యవసాయశాఖ ఉద్యోగులు

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

(5వ పేజీ తరువాయి)

ఉన్నా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు నోటా సింబల్‌ను కూడా తప్పనిసరిగా సరి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ తరగతుల్లో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఏపీసీ రామారావు, డీఎల్‌పీవో, ఆర్‌ఓలు, సహాయ ఆర్‌ఓలు పాల్గొన్నారు.

ముగిసిన మూడో విడత నామినేషన్లు

(5వ పేజీ తరువాయి)

ఉపసంహరించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఏకగ్రీవాల కోసం సైతం ప్రయత్నాలు జరుగుతున్నాయి. మూడో విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకోసం శుక్రవారం నామినేషన్లు దాఖలు గడువు ముగిసింది. దీంతో సాయంత్రం 5గంటల వరకు నామినేషన్‌ల కోసం సమయం ఉండడంతో అభ్యర్థులు నామినేషన్‌లు వేసేందుకు బారులు తీరారు. దీంతో కొన్నిచోట్ల అర్ధరాత్రి వరకు నామినేషన్‌లు స్వీకరించారు. సమయం ముగియడంతో అధికారులు గేట్లను మూసివేసి నామినేషన్‌లు వేసేందుకు వచ్చిన వారికి టోకెన్‌లు ఇచ్చి నామినేషన్‌లు తీసుకున్నారు.

మొదటి విడతలో ప్రచారం ముమ్మరం..

జిల్లాలో బోధన్ రెవెన్యూ డివిజన్‌తో పాటు నవీపేట మండలంలోని 184 గ్రామ పంచాయతీలు, 1642 వార్డులకు మొదటి విడత ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో 29 గ్రామ సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా వందల సంఖ్యలో వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన సర్పంచ్, వార్డు స్థానాలకు ఈ నెల 11న పోలింగ్ జరగనుండడంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్‌ఎస్, బీజేపీలు బలపరుస్తున్న అభ్యర్థులు పోటీలో ఉండడంతో ఆయా పార్టీల నేతలు వారి తరఫున గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు తమకు కేటాయించిన గుర్తులతో ప్రచారాలను ముమ్మరం చేశారు. రెండో విడత ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించి గుర్తులను కేటాయించనున్నారు. ఆదివారం నుంచి రెండో విడత ఎన్నికల గ్రామాలలో ప్రచారం ముమ్మరం కానుంది.

కాంగ్రెస్‌లో బుజ్జగింపుల పర్వం

(5వ పేజీ తరువాయి)

వేణుగోపాల్‌యాదవ్, మారా చంద్రమోహన్‌లతో పాటు నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశించి భంగపడ్డ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, జావెద్ అక్రం, రామర్తిగోపి, శరత్, గన్‌రాజ్, తదితరులతో వారు ప్రత్యేకంగా మాట్లాడారు. భవిష్యత్తులో పార్టీ పదవులతో పాటు ప్రభుత్వ పదవుల్లో అవకాశం కల్పిస్తామని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించినట్లు సమాచారం. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సైతం పాల్గొన్నారు.

హలో బాగున్నారా..!

(5వ పేజీ తరువాయి)

వేయాలని మాటకూడా తీసుకుంటున్నారు. హైదరాబాద్, ఇతర ముఖ్య పట్టణాలలో ఉద్యోగాలు చేస్తున్న వారంతా ఓట్ల కోసం గ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో గడపవచ్చనే ఆలోచన చేస్తూ పోలింగ్ రోజు సొంత గ్రామాలకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌లు

పంచాయతీ ఎన్నికల్లో సోషల్‌మీడియా కీలకపాత్ర పోషిస్తోంది. ఎక్కడ ఉన్న ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకోలేకపోయిన వాట్సాప్ ద్వారా అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఫోన్‌లలో బ్రాడ్‌కాస్ట్ గ్రూప్‌లను ఏర్పాటు చేసుకుని ప్రత్యేకంగా ఓటర్లకు సందేశాలను పంపుతున్నారు. అభ్యర్థులు తాము గెలిస్తే ఏం చేస్తామో వివరిస్తూ సిద్ధం చేసుకున్న ఎన్నికల ప్రచార చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. గతంలో తాము చేసిన సేవ కార్యక్రమాలను, గ్రామాల్లో తాము పరిష్కరించిన సమస్యలను తెలియజేస్తూ ప్రచారం చేసుకుంటూ ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాము సర్పంచ్‌లుగా గెలిస్తే ఏవిధంగా అభివృద్ధి చేస్తామో వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. గుట్టుచప్పుడుకాకుండా విందులు, వినోదాలకు ఆన్‌లైన్ పేమెంట్‌లు చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఐదారుగురు కలిసి ఒకచోట చేరి పోటీలో ఉన్న అభ్యర్థికి ఫోన్‌చేస్తే వారికి కావాల్సినవన్నీ క్షణాల్లో వారిముందు ఉంటున్నాయి. గ్రామాల్లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు ఓటర్లకు పండగలా మారాయి. అలిగితేచాలు అభ్యర్థులు క్షణాల్లో వారికి కావాల్సినవన్నీ చేస్తున్నారు. నామినేషన్‌ల ఘట్టం ముగియడంతో అభ్యర్థులు ప్రచారంలో బిజీగా ఉంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే క్రమంలో అన్ని దారులు తమ వైపునకు ఉండేలా చూసుకుంటున్నారు.

విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాల కోసం అర్హులైన విద్యార్థులు అందరూ సకాలంలో ఆన్ లైన్లో దరఖాస్తులు చేసుకునేలా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం సంక్షేమ శాఖల జిల్లా అధికారులతో కలిసి అన్ని మండలాల ఎంఈఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులతో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేయించాలన్నారు. ఈ నెలాఖరు చివరి గడువు కాగా, ఆలోపే ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరాటే శిక్షకులకు..

జిల్లాలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో కరాటే నేర్పించుటకు శిక్షకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పవన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాణిలక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణలో భాగంగా జిల్లాలోని 262 ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కరాటే నేర్పించుటకు శిక్షకులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల శిక్షకులు ఈనెల 8న సోమవారం ఉదయం 10గంటల జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. శిక్షణ ఇచ్చే మాస్టర్లు తప్పనిసరిగా బ్లాక్‌బెల్ట్ కలిగి ఉండి ధ్రువపత్రాలను తెచ్చుకోవాలన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఇందూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖానాపూర్ చౌరస్తా వద్ద శుక్రవారం బిహార్‌కు చెందిన రాంనాథ్ మెహత గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టుచేశారు.అతడి నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడికి వచ్చిన ఏడుగురు వినియోగదారులను పట్టుకొని పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చిందని, దీంతో అందరిపై కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ మూడో పట్టణ ఎస్‌ఐ హరిబాబు తెలిపారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వైభవంగా మహాపడిపూజ

ఇందూర్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం శుక్రవారం ఆధ్యాత్మిక పవనాలతో పరవశించింది. గురుస్వామి శశాంక్‌శర్మ స్వామి ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు పెదబాబు, సురేష్, వినోద్, రవిబాబు, నవీన్, రామకృష్ణ, గంగాప్రసాద్, నరేష్, సురేష్, శివ, సతీష్ తదితరులు సేవ చేసిన తీరు కార్యక్రమానికి మరింత వైభవాన్నిచ్చింది. అయ్యప్పని దర్శించుకున్న ప్రతి భక్తుడు మనసారా నమస్కరించి, స్వామి ఆశీర్వాదాలు స్వీకరించారు.

పడిపూజలో పాల్గొన్న భక్తులు →



క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

» స్టేడియాల నిర్మాణంపై అసెంబ్లీలో గళం వినిపిస్తా
» సుబ్బారావు స్మారక క్రీడాపోటీల్లో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త అన్నారు. జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో శుక్రవారం సుబ్బారావు స్మారక క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందూరు గడ్డ క్రీడాకారుల అడ్డా అని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు జిల్లాకు పేరు తీసుకువచ్చారని తెలిపారు. ఖేలో ఇండియ ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. భవిష్యత్తులో భారతదేశం అత్యధిక ఒలంపిక్ పతకాలు గెలిచేలా ఖేలో ఇండియా కార్యక్రమాన్ని కేంద్రం ప్రకటించిందన్నారు. జిల్లాకేంద్రంలో స్టేడియం నిర్మాణాలపై అసెంబ్లీలో గళం విప్పుతానన్నారు. కార్యక్రమంలో క్రీడల యువజనశాఖల అధికారి పవన్, ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, టోర్నీ కన్వీనర్, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు అజ్మత్‌ఖాన్, మీసాల ప్రశాంత్, ట్రెజరర్ గంగారాజు, కాకతీయ కళాశాలల డైరెక్టర్ రామోజీరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలి

(5వ పేజీ తరువాయి)

రిలీజ్ చేయడం జరిగిందన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ శేఖర్ గౌడ్, సీఐ నాగేష్, వివిధ పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల విలువిద్య పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపికచేసినట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి గంగారాజు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేశామని, వారు ఈ నెల 7న హైదరాబాద్‌లోని పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికల్లో కోచ్ మురళి, నేనావత్ రవిందర్, ప్రతాప్, దాసు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు వస్తదో.. రాదో..?

(5వ పేజీ తరువాయి)

ప్రజలకు ఉపశమనం కలుగుతుందనేది స్పష్టంగా ఉన్నా సమస్యను పట్టించుకునే తీరు మాత్రం కనిపించడం లేదు. పల్లెప్రాంతాల ప్రజలకు కనీస రవాణా సౌకర్యం అందకపోవడం పెద్ద సమస్యగా మారింది.

ఎంక్వయిరీ మూగనోము..

బస్సుల సమయాలు తెలుసుకోవడానికని ఆర్టీసీ ఇచ్చిన ఎంక్వయిరీ నంబర్లు చాలా సార్లు మోగవు. మోగినా స్పందన ఉండదు, స్పందించినా ఉపయోగపడే సమాచారం దొరకదు అనే స్థితి ఏర్పడింది. ప్రజలు కాల్ చేస్తే "టైమ్ కాదు" లేదా "సిగ్నల్ లేదు" అనే మాటలు విసుగుపుట్టిస్తున్నాయి. సమాచారం లేక, సకాలంలో బస్సులుండక ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ పని కోసం బయల్దేరేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఎంక్వయిరీ పనిచేయకపోవటంతో చాలామంది అనవసరంగా ప్రత్యామ్నాయ వాహనాలకు అధికంగా చెల్లించాల్సి వస్తోంది. పరిస్థితిని ఆసరాగా తీసుకుని కొన్ని ప్రైవేట్ వాహనదారులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం, వ్యవస్థలో మెరుగులపై ఎలాంటి సంకేతాలు లేకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.

అదనపు బస్సులు నడపాలని డిమాండ్

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క బస్సుతో రాకపోకలు సాగడం అసాధ్యం అని ప్రయాణికులు చెబుతున్నారు. ఆర్మూర్‌బాద్, మాక్లూర్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్యే గణనీయంగా ఉంది. కానీ వారి ప్రయాణ అవసరాలను అర్థం చేసుకునేలా బస్సుల కేటాయింపు లేదు. "రోజూ ఇదే జరిగితే డ్యూటీకి ఎలా చేరుకోగలం?" అని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం 2బస్సులు ఉదయం పూట నడిపిస్తే సమస్య సగం పరిష్కారమవుతుందని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. గ్రామాలన్నీ కలిసేలా రవాణా సౌకర్యం అందితే విద్యార్థుల నుంచి వృద్ధులవరకు అందరూ లాభపడతారు. డిపో ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

దేవి : రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఆంధ్రకింగ్ తాలూకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ధురంధర్ (హిందీ) (11.15 9.15, 2.15, 6.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : దురంధర్ (హిందీ) (10.00)
: ఆంధ్రకింగ్ తాలూకా (1.45, 7.20, 10.20)
:రాజు వెడ్స్ రాంబాయి (4.45)

స్క్రీన్-2 : రాజు వెడ్స్ రాంబాయి (11.00, 10.30)
: దురంధర్ (హిందీ) (1.30, 06.40)
స్క్రీన్-3 : రాజు వెడ్స్ రాంబాయి (1.20, 7.40)
: దురంధర్ (హిందీ) (3.50, 10.10)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-2 : జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (11.30)
:దురంధర్ (హిందీ) (2.00, 6.15, 10.30)
స్క్రీన్-3 : దురంధర్ (హిందీ) (10.00, 5.45)
: తేరే ఇష్క్‌మే (హిందీ) (2.15, 10.00)
స్క్రీన్-4 : రాజు వెడ్స్ రాంబాయి (10.10, 4.20)
: ఆంధ్రాకింగ్ తాలూకా (1.00, 7.10, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,29,000	రూ.1,18,000	రూ.1820

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290

